# వాడు!

పి.చంద్రశేఖర అజాద్

నాకెందుకో వాడ్ని ఆ భంగిమలో చూస్తుంటే "గౌతముడు" గుర్తుకొచ్చాడు.

'వాడ్ని' అంటున్నానుకదా అంటే నాకు దగ్గరగా సంబంధంవున్న వ్యక్తి అయి ఉంటాడా అనే అనుమానం రావచ్చు.

వాడు మా బంధువు కాదు. పోనీ స్నేహితుడా అంటే ఓ రకంగా స్నేహం కూడా కాదు. నాకూ వాడికీ నడుమ పదిహేను సంవత్సరాల తేడా ఉంది.

అంతమాత్రాన విభిన్న వయసులవారు స్నేహం చెయ్యకూడదని కాదు నా ఉద్దేశం. వాడు నన్నెప్పుడూ అలా చూడడు. చాలా మర్యాదగా మాట్లాడతాడు. నన్ను 'సార్' 'సార్' అనే పిలవటం కూడా.

సంవత్సరం క్రితం తను ఈ ఊరు వచ్చినప్పుడు వాడి కళ్లలో బెరుకును గమనించి నాకు నవ్వు వచ్చింది. నేనుకూడా కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నప్పుడు అలానే ప్రవర్తించాననుకొంటాను.

జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చాక 'వాడు' అందరి దగ్గరికీ వచ్చి నమస్కరించాడు. వాడితో పాటు వాళ్లన్నయ్య వచ్చాడు. వాళ్లిద్దరూ ఓ హోటల్లో దిగారు. సాయంకాలం ఆఫీస్ అయిపోయాక వాళ్లన్నయ్య నా దగ్గరకొచ్చి.

"సర్ మీరు మాతోపాటు టీ తీసుకుంటానికి రావాలి" అన్నాడు.

"దాందేముంది సార్. దగ్గర్లో టీస్టాల్ ఉంది తెప్పించుకుందాం" అన్నాను.

"అలాకాదు సార్ మీతో కొంచెం మాట్లాడాలి. మా రూంకి వెళ్దాం. మా కోసం మీరు కొంత సమయం కేటాయించగలరా?" అన్నాడు నమ్రతగా.

"భలేవారే. తప్పకుండా వెళ్దాం" అన్నాను.

ఆ తర్వాత వారితో కలిసి వారి గదికి వెళ్లాను. మా ఆఫీసులో అందరూ యువకులే, మేనేజర్‌తో పాటు. అందరిలోకి నేనే కొంచెం వయసు ఎక్కువ ఉన్నవాడ్ని. అందుకే దాదాపు అందరూ నన్ను చూసో, నా వయసు చూసో గౌరవం ఇస్తుంటారు. ఈ నడుమ అకస్మాత్తుగా ఇంటర్వ్యూలు జరిపి కొన్ని ఉద్యోగాలు ఇచ్చారు. చాలా కాలంగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయనుకుంటాను. రిజర్వేషన్ కోటాలో అవి అలా పడున్నాయి. మాకు తను ఆర్డర్ తీసుకువచ్చేదాకా తెలియదు. వాడు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చాక పోస్ట్‌లో వచ్చింది.

వాళ్లన్నయ్యే మాట్లాడుతుంటే 'వాడు' బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. చాలా సేపు నిలబడే ఉంటే...

"కూర్చోబాబు" అన్నాను.

రెండుసార్లు చెబితేగాని కూర్చోలేదు.

"నేను హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాను సర్. వీడు నా రెండో తమ్ముడు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక కొద్దికాలంపాటు అక్కడే నాకు తెలిసిన వారి దగ్గర పెట్టాను. ఇంతలో ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లోనే పోస్టింగ్ ఇమ్మని చాలా ప్రయత్నం చేశాం. కుదరలేదు. ఇంతవరకూ వీడు ఎప్పుడూ ఒంటరిగా ఉండలేదు. పైకి చెప్పటం లేదుగానీ తను చాలా భయపడుతున్నాడు..." అన్నాడు.

"ఏం భయం అవసరం లేదు. కొత్తకదా మొదట్లో అలానే ఉంటుంది. అయినా మేమందరం ఉన్నా కదా. ఇంకేం భయం?" అన్నాను.

"నిజమే సర్. మిమ్మల్ని చూడగానే నాకు ధైర్యం వచ్చింది. నేను రెండు మూడు రోజులు ఉండి రూం అదీ చూసి వెళ్దామనుకుంటున్నాను" అన్నాడు.

"మీరేం కంగారు పడాల్సిన అవసరం లేదు. ఈ హోటల్ రూమ్‌కూడా అనవసరం. మా ఆఫీస్‌లో ఓ రూం ఖాళీగా ఉంది. తనకు రూం దొరికేదాకా అందులో ఉండొచ్చు. ఇక్కడ స్టాఫ్ అంతా మంచివాళ్లు. మేనేజర్ కూడా మంచివాడే" అన్నాను.

"మీ స్టాఫ్ అందరూ బాగుంటారా... మరోలా అనుకోకండి నేనూ ఎంప్లాయినే. మాలోని రకరకాల రాజకీయాలున్నాయి" అన్నాడతను.

"అబ్బే అలాంటిదేం లేదు లెండి. అందరం కలిసే ఉంటాం, ఉద్యోగం అన్నాక చిన్నచిన్న అభిప్రాయ భేదాలు రావటం సహజమేకదా" అన్నాను.

"జనరల్‌గా అడిగాను సర్. ఏమనుకోవద్దు" అంటూ మరలా నొచ్చుకున్నాడు.

ఆ తర్వాత చెప్పాడు...

"వీడ్ని మీ చేతుల్లో పెట్టే వెళుతున్నాను. వీడు మీ స్వంత తమ్ముడిలాంటివాడు. వీడికింకా పెళ్లికాలేదు. అవసరమైతే మీరు వీడ్ని నాలుగు తగిలించినా నేనేం అనుకోను" అన్నాడు.

"భలేవారే" అన్నాను నవ్వుతూ వాడికేసి చూస్తూ.

వాడూ బలవంతంగా నాకేసి చూసి నవ్వబోయాడు...

ఈసారి వాడికి చెప్పాడు.

"చూడు వీరు నీకు నేనెంతో అంత. వారు ఏం చెబితే అది చెయ్యి, నీకు వర్క్‌లో ఏం తెలియకపోయినా సిగ్గుపడకుండా అడుగు, వారు చెబుతారు. ఇది మన ఊరుకాదు. చాలా జాగ్రత్తగా ఉండాలి. పిచ్చిపిచ్చి వేషాలు వేసి వెధవ పేరు తెచ్చుకోవద్దు. అందరితో బాగుండాలి" వాడేమీ మాట్లాడకుండా అన్నింటికీ తలూపాడు.

ఆ తర్వాత అతను వద్దన్నా వినకుండా స్వీటూ, హాట్ తెప్పించాడు.

ఆ తరువాత కాఫీలు తాగాం.

"మీరేం వర్రీ కాకండి. నేను చూస్తుంటాను" అని చెప్పి వచ్చాను. తనకి నన్ను చూశాక ఎంత ధైర్యం వచ్చిందంటే నాలుగు రోజులు ఉందామనుకున్న వ్యక్తి మరునటిరోజు వెళ్లిపోయాడు.

వాడు సన్నగా ఉంటాడు. బలంగా గాలివీస్తే పడిపోయేటట్లుంటాడు. అయితే వాళ్ల అన్నయ్య కంగారు పడేంత అమాయకుడు కాదు.

ఓ వారం రోజుల్లోనే రూం దొరికిందని చెప్పాడు. ఓ సాయంకాలం వెళ్లి చూశాను ఆ అద్దెలో మంచి ఏర్పాటే. వెంటనే చేరిపొమ్మని చెప్పాను. వాడి అన్నయ్య హైదరాబాదు వెళ్లాక ఉత్తరం రాశాడు నాకు ప్రత్యేకంగా. నేనుకూడా అతనికి అంతా బాగుందని రాశాను.

చూస్తుండగానే కాలం చకచకా నడిచింది. వాడు వర్క్ విషయంలో ఏమాత్రం వేలెత్తి చూపించదగిన విధంగా ఉండేవాడు కాదు. అయితే నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే నేను అయిదారు సంవత్సరాలుగా ఇక్కడ పని చేస్తున్నాను. నాకున్న పరిచయాలు చాలా తక్కువ. ఈ కొద్దికాలంలోనే వీడికి ఎంతమందితో పరిచయం అయిందో చెప్పలేను.

వాడి కోసం మోటార్ సైకిళ్ల మీద ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తుంటారు. 'లంచ్'కు వెళ్లాలన్నా, 'రూమ్'కు వెళ్లాలన్నా ఎప్పుడూ 'బండి' ఉండాల్సిందే. చూస్తుండగానే నాలుగయిదు రకాల బట్టలు కుట్టించాడు. ఆఫీస్‌కి నీట్‌గా తయారై వచ్చేవాడు.

ఆఫీస్‌లో తోటివారందరితో కూడా హాయిగా మాట్లాడుతుండేవాడు. వారందరూ మంచి జోక్స్ విసురుకుంటుండేవారు.

నేను వారి విషయం అంతగా పట్టించుకునే వాడ్ని కాదు. ఎందుకంటే మాలో వయసురీత్యా అభిరుచుల రీత్యా కూడా చాలా తేడాలున్నాయి. నేను వాడ్ని కొంతకాలంపాటు "బాబు"అని పిలుస్తుండేవాడిని. అయితే ఓరోజు వచ్చి అన్నాడు.

"సార్... మీరు నన్ను 'బాబు' అని పిలవడం బాగుండలేదు"

"మరేమని పిలవమంటావ్?" అన్నాను.

"ఒరేయ్ అని పిలవండి"

"అదేంటయ్యా..."

"అవునుసార్ మా అన్నయ్య నన్ను అలానే పిలుస్తాడు" అన్నాడు నాకు నవ్వు వచ్చింది.

తర్వాత నాకు వాడ్ని అలానే పిలవటం అలవాటయింది.

అది అలా ఉంటే మా కొలీగ్స్ కొందరు వాడి మీద నాకు కొన్ని అభిప్రాయాలు చెప్పారు.

"అన్నా... మనవాడు నువ్వనుకునేంత అమాయకుడేం కాదు. చాలా వ్యవహారాలున్నాయి."

"అదేమిటో వివరంగా చెప్పకూడదూ"

"వాడికి పెద్ద పెద్ద వాళ్లతో స్నేహం ఉంది"

"అదొక్కటేనా?"

"అది చాలు. వాళ్లేం సామాన్యులు కాదు. మందు తాగుతారు. ఆడపిల్లల్ని అల్లరిచేస్తారు."

ఆడపిల్లల్ని అల్లరి చేసే వాళ్లని నేను చాలా మందిని చూశాను. వారిని ఏదైనా అనాలనుకున్నప్పుడు వెంటనే నా చదువుకునే రోజులు గుర్తొచ్చాయి. ఈ విషయంలో మేమేం మర్యాదస్థులం కాదు. అయితే మా విషయంలో కొంచెం తేడావుంది. మేం ఆడపిల్లల్ని ఇంత వల్గర్‌గా అల్లరి చేసేవాళ్లం కాదు. వారి వెనకాల నడుస్తూ జోక్స్ పేలుస్తుంటే వాళ్లూ ఆనందించేవాళ్లు.

ఇప్పుడలా కాదు. చాలామంది యువకులు ఆడపిల్లల శరీరాలమీదే వికృతమైన కామెంట్స్ చేస్తున్నారు.

ఇంక "మందు" విషయం. దాదాపు సగంమంది యువకులకి ఈ వ్యసనం పాకింది. అందులోనూ వీడు ఉద్యోగం చేస్తున్నాడు. చేతినిండా డబ్బుంటుంది. ఓ వేళ 'మందు'తాగినా ఆశ్చర్యం ఏముంది?

నేను వాడ్ని ఓ రోజు హోటల్‌కి తీసుకువెళ్లి క్లాస్ తీసుకున్నాను.

"ఏరా... నువ్వు కొంచెం పెద్దవాడివయినట్లుందే" అన్నాను.

"అదేంటిసార్! అలా అన్నారు" అన్నాడు కంగారుగా.

"నీ పరిచయాలూ, వ్యవహారాలూ చూస్తుంటే అలా అనిపించింది"

"అబ్బే... అలాంటిదేం లేదు సార్. వారందరూ మంచివాళ్లు వాళ్లు కూడా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మేమందరం బ్యాచిలర్స్ కదా. అందుకని ఫ్రెండ్లీగా ఉంటాం."

"బార్లకి వెళ్తుంటారా?"

"ఎప్పుడన్నా వెళ్తుంటాం. అయినా నేను డ్రింక్ చేయను" అన్నాడు. అంతేకాదు "మనకొచ్చే జీతాలెంత సార్, తాగితే ఇంకేమైనా ఉందా" అనికూడా అన్నాడు. మొత్తంమీద వీడు లాజిక్ తెలిసినవాడు.

"ఏదో సరదాగా ఆడపిల్లల్ని ఏడిపిస్తాం. మీకేం సార్ సాయంకాలం అవ్వగానే ఇంటికి వెళ్తారు. పిల్లల్తో హాయిగా ఉంటారు. మాకేం తోచదు. అందుకే సినిమాలకు వెళ్తుంటాం. రోడ్ల వెంట తిరుగుతుంటాం" అన్నాడు.

"ఇదంతా బాగానే ఉంది. అయినా ఏం తోచకపోతే చేయటానికి ఈ దరిద్రపు పనులు తప్పించి ఇంకేం లేవా... ఏదిఏమైనా వాళ్ల అన్నయ్య ఏదో మర్యాదకి చెప్పాడే అనుకోండి... ఓ దశకిమించి వెళ్తే "నా సంగతి నేను చూసుకుంటాను" అంటే నా పరువేం కావాలి.

అందుకే స్నేహపూర్వకంగా చెప్పాను.

"చూడరా... నువ్వు ఒంటరిగా వున్నావు. చేతిలో డబ్బుంది. చుట్టూ చాలా ఆకర్షణలుంటాయి. కుర్రవాడివి కాబట్టి వాటికి త్వరగా ఆకర్షింపబడతావు. నేనుగానీ మీ అన్నగానీ నీ విషయంలో సలహాలు ఇవ్వగలంగానీ, నీ జీవితాన్ని మలుచుకోవలసింది నువ్వు."

వాడేం మాట్లాడలేదు.

ఆలోచిస్తూండిపోయాడు.

ఆ తర్వాత కూడా నాకు మరికొన్ని వార్తలు వచ్చాయి.

అందులో నన్ను ఆశ్చర్యానికి గురిచేసే అంశం...


వాడ్ని చూస్తే అలా కనిపించడు. ఇంకా పాలుకారుతున్న వాడిలా ఉంటాడు. ఏ ఇంటర్ చదువుతున్న విద్యార్థిలానో ఉంటాడు. వాడు అలా చేస్తున్నాడని చెప్పినా ఎవరూ నమ్మరు.

నా ముందు వాడు ఎంత మర్యాదకరంగా ప్రవర్తించినా నాకెందుకో వాడిమీద అనుమానంగా ఉంది. అయితే ఈ విషయం గురించి నేను వాడ్ని హెచ్చరించలేదు కూడా. నిర్దుష్టంగా తెలియందే ఇలాటి విషయాల్ని కుర్రవాళ్లతో ఎలా మాట్లాడటం?

అయితే రెండురోజులుగా వాడిముఖంలో కళాకాంతులు లేవు. వాడు ఎందుకలా ఉన్నాడో నాకు అర్థం కాలేదు. అదేమిటో రెండుసార్లూ నడిచే వెళ్తున్నాడు. వాడికోసం రోజూ వచ్చే మిత్రుడూ రావడం లేదు. అంతకుమించి తను చేస్తున్న పనిలో కూడా తప్పులు వస్తున్నాయి.

"ఏంటిరా... అలా ఉన్నావేమిటి?"

( మిగతా 13 వ పేజీలో )



9/6/91

9/6/01

## ఈ వారం కథ

( 10 పేజీ తరువాయి )

"ఎలా ఉన్నాను. బాగానే ఉన్నాను సార్" అన్నాడు.

"లేదురా నల్లబడిపోయావ్. కళ్లకింద చారలు వచ్చాయి. ఆరోగ్యం బాగుండటం లేదా?"

"బాగానే ఉంటోంది."

"నీ ఫ్రెండ్ రావటం లేదేమిటి? గొడవలు జరిగాయా?"

"అదేంలేదు సార్. ఊర్లో లేడు అంతే"

"మరేమిటి. నువ్వు ఇదివరలా ఉండటం లేదు" అన్నాను.

"నేను బాగానే ఉన్నాను సార్" అని బలవంతంగా నవ్వాడు.

అంతకుమించి నేను ఆ విషయంమీద రెట్టించదలుచుకోలేదు.

అయితే వాడి విషయం అందరికీ చర్చనీయాంశం అయింది. కొంతమంది నా దగ్గరకొచ్చి అడిగారు కూడా.

"ఏమిటి వాడలా ఉన్నాడు? మీకేమైనా చెప్పాడా?" అని

"నాకేం చెప్పలేదు. అయినా నాకు చెప్పటానికి సిగ్గుపడితే మీకైనా చెప్పవచ్చుగా" అన్నాను

"ఏమోనండి... ఏం లేదు అంటాడు తప్పించి ఏమీ చెప్పడు. ఏమీ లేకపోతే అలా ఉండటం ఎందుకు?"

"పోనీండి. వాడి వ్యక్తిగతం అయివుంటుంది" అన్నాను.

"ఎవరినన్నా ప్రేమించి భంగపడ్డాడేమో" అన్నారు

"చూద్దాం. అలాంటిది ఉంటే వాడే చెబుతాడుగా" అన్నాను.

ఇన్ని రోజుల నుండి వాడు మా ఇంటికి ఒక్కసారిగాను వచ్చాడు. అది కూడా వాడి మిత్రుడి వెహికిల్ మీద.

"భోజనానికి ఓసారి రారా" అంటుంటాను.

"వస్తాను సార్ తప్పకుండా వస్తాను" అంటాడు మించి రాడు.

నేను ఆఫీస్‌నుంచి వచ్చాక స్నానంచేసి 'హిందూ' పేపర్ అందుకున్నాను.

మా అబ్బాయి వచ్చి

"నాన్నగారూ... అంకుల్ వచ్చారు" అన్నాడు

ఎవరా అనుకుంటూ వెళ్లాను.

వాడే!

నన్ను చూసి ముఖంమీదికి నవ్వు తెచ్చుకున్నాడు.

"రారా" అంటూ ఆహ్వానించాను.

ఆ తర్వాత ఇద్దరం మా డాబా మీదకు వెళ్లాం.

"ఏమిటి ఇలా వచ్చావు? చూట్టానికేనా? పనేమైనా ఉందా?" అన్నాను. వాడోసారి నా కళ్లలోకి చూసి తలదించుకున్నాడు.

"ఏమిట్రా ఏమైంది?" అన్నాను.

వాడు తెలెత్తాడు...

కళ్లలో నుదులు తిరుగుతున్న కళ్లు...

ఆ క్షణం నాకు వాడి మీద జా[illegible] కలిగింది.

పిచ్చి వెధవ... ఏదో జరిగి ఉంటుంది. చెప్పుకోవటానికి సిగ్గో, భయమో మరేదో కలిగి ఉంటుంది.

"ఏమిట్రా అది... ఛ... ఊర్కో... ఏమైంది? నీకు నేనున్నా. ఏం పర్లేదు." అన్నాను.

జేబులోనుంచి కర్చీఫ్ తీసి తుడుచుకున్నాడు.

కొద్ది సేపటి తర్వాత...

"మిమ్మల్ని నేను మోసం చేశాను సార్" అన్నాడు.

ఈసారి నాకు ఆశ్చర్యం కలిగింది. అయినా అదేం కనిపించనీయకుండా

"నన్ను మోసం చేయటం ఏమిటి?" అన్నాను.

"అవును సార్! ఇంతకాలం నేను నా స్నేహితుల్తో పాటు తాగాను. తిరిగాను. అంతకుమించి నేను వ్యభిచారం చేశాను" అన్నాడు.

ఇలాంటి సన్నివేశం ఎదురౌతుందని నాకు తెలుసు. అయినా వాడలా చెప్పగానే నాకెందుకో ఇబ్బంది అనిపించింది. ఏం మాట్లాడాలో అర్థంకాలా...

అలా మా నడుమ పేరుకుపోయిన నిశ్శబ్దం నుండి వాడి మాటలే వినిపించాయి.

"నాకు ఇంతకుముందోసారి చెప్పారు. అయినా నేను లెక్క చెయ్యలేదు. నన్ను క్షమించండి సార్" అన్నాడు.

నాకు తలుచుకుంటున్నకొద్దీ ఆశ్చర్యంగా ఉంది. ఇంతకీ వీడేం చెప్పదలుచుకున్నాడు. ఇంత హఠాత్తుగా తన తప్పులన్నీ ఎలా గుర్తొచ్చాయి?

"సర్లే... ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు, జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుండీ జాగ్రత్తగా ఉండు" అన్నాను.

"ఇంకానా... ఇంక జీవితంలో ఎప్పుడూ వ్యభిచారం చెయ్యను సార్" న్నాడు దృఢంగా.

"ఏమిటంత గట్టిగా చెబుతున్నావ్" అన్నాను.

వాడు చెప్పిందది

"మొన్న ఆదివారం మేం వేరే ఊరువెళ్లాం సార్. మేం అప్పుడప్పుడూ వెళ్తుంటాం. అప్పుడు నా కోసం ఓ అమ్మాయి వచ్చింది సార్. నాకైతే మతిపోయింది. నా జీవితంలో అంత అందమైన అమ్మాయిని చూడలేదు. ఇంకా ఆ అమ్మాయి నా కళ్లలో మెదులుతూంది. ఆ అమ్మాయిని అసలు తాకాలనిపించలేదు సార్. మీద చెయ్యివేస్తే మాసిపోయేలా ఉంది. ఎంత తెల్లగా ఉందనుకున్నారు! పెద్దకులం అమ్మాయి సార్. కాలేజీలో చదువుకుంటోంది. ఫీజుల కోసం వాళ్ల అమ్మ మందుల కోసం తను ఇలా చేయాల్సి వచ్చిందని చెప్పింది. నా దగ్గర ఓ యాభై రూపాయలు మాత్రం ఉన్నాయి సార్. అవి ఇచ్చేసి, వెళ్లిపొమ్మని చెప్పాను. నాకెంత ఆవేశం వచ్చిందంటే ఆ అమ్మాయిని ఎవరి దగ్గరకైనా వెళ్తుందని తలుచుకుంటేనే చాలా నాకు బాధగా ఉంది సార్. ఆ అమ్మాయిని నేను మరిచిపోలేకపోతున్నాను. అందుకే ఇంకెప్పుడూ వ్యభిచారం చెయ్యదలుచుకోలేదు" అన్నాడు.

నేను వాడికేసి చూస్తూండిపోయాను.

వాడ్ని పంపించాక నేను తిరిగి డాబా మీదకు వెళ్లాను. ఇదంతా వాడిలో మార్పేనా?

పోనీ ఈ మార్పు శాశ్వతమా? ప్రసూతి వైరాగ్యం లాంటిదా?

ఆ విషయం రేపు వాడి ఆచరణ చెబుతుంది.

వీడ్ని ఇంతగా కదిలించిన ఆ అమ్మాయిని తలుచుకుంటే నాకూ బాధగా ఉంది.

అయితే వాడి మాటలన్నీ నెమరు వేసుకుంటే...

నాకు వాడిలో వచ్చిన మార్పు చాలా సంకుచితంగా అనిపించింది.

నాకాక్షణం వాడి మీద ఎంత అసహ్యం కలిగిందంటే...

వాడిలో వచ్చిన ఆ మంచి మార్పును కూడా నేను దృష్టిలోకి తీసుకోలేకపోయాను...

వాడికి మొత్తంగా తనువు అమ్ముకునే స్త్రీలందరి మీదా సానుభూతి కలిగితే నేను అర్థం చేసుకునేవాడిని.

పెద్ద కులం అమ్మాయి... తెల్లటి తోలు కలిగిన పిల్ల వ్యభిచరిస్తున్నందుకు మాత్రమే బాధపడిపోయిన వాడ్ని తలుచుకున్న కొద్దీ...

తెరలు... తెరలుగా అసహ్యం!

వాడిమీద కాదు— అలాంటి ఆలోచనకు ఊపిరులూదిన సంస్కృతిమీద! ●